క్లుప్తంగా

నేడు గాలివీడుకు ఎమ్మెల్యే

గాలివీడు : రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి గాలివీడుకు అసైన్‌మెంట్, ఇనామ్ భూ హక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు రానున్నారు. శనివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని ఎస్‌కే కాల్యాణ మండపంలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతున్నట్లు తహసీల్దార్ దైవాదీనం శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన 17 గ్రామ పంచాయతీల లబ్ధి పొందే రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట రూరల్ : రాజంపేట, పెనగలూరు మండలాల పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ లైన్‌ల వెంబడి ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ ఎం. సురేంద్రనాథ్ శుక్రవారం తెలియజేశారు. దీని కారణంగా రాజంపేట పట్టణంలోని ఎర్రబల్లి, సాయినగర్, మన్నూరు, మండలంలోని తాళ్లపాక, కె.బోయినపల్లి, గుండ్లూరు, పెనగలూరు మండలంలోని పెనగలూరు, కొండూరు, సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

గడ్డివామి దగ్ధం

సిద్దవటం : మండలంలోని టక్కోలి గ్రామ సమీపంలో ఉన్న శివాలయానికి వెనుక వైపు ఉన్న వరిగడ్డి వామికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని దగ్ధమైంది. టక్కోలి గ్రామానికి చెందిన బత్తల సుబ్బరాయుడు అనే రైతు ఇటీవలే వరి పంటను కోసి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకోగా, గడ్డిని పశువుల కోసం వామిగా వేసుకున్నాడు. గడ్డివామి దగ్ధం కావడంతో స్థానికులు కడప అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది హుటాహుటిన టక్కోలికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే వామి కాలిపోవడంతో రైతు సుబ్బరాయుడుకు రూ. 15వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

ఉచిత యోగా శిక్షణ

రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ వాసవీ యోగా శిక్షణ శిబిరం ఆధ్వర్యంలో ఉచితంగా యోగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి డిసెంబర్ 6 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమం రాయచోటి డైట్ హాస్టల్లో నూతనంగా ఏర్పాటు చేసిన మున్సిపల్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఉంటుందన్నారు. ఉదయం 6:15 గంటల నుంచి 7:15 గంటల వరకు తరువాత సాయంత్రం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు యోగా శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. యోగా శిక్షకులు ఆంధ్ర యూనివర్శిటీ యోగా సర్టిఫికెట్ హోల్డర్, యోగా సామ్రాట్ రాము ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు జరుగుతాయని తెలియజేశారు.

భూ పంపిణీకి సర్వం సిద్ధం

పుల్లంపేట : భూ పంపిణీకి సంబంధించి సబ్ డివిజన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ నరసింహకుమార్ అన్నారు. శుక్రవారం గ్రామ సచివాలయాల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకటో విడత భూ పంపిణీ పూర్తయ్యిందన్నారు. ఇందుకు సంబంధించి సబ్ డివిజన్లు భూములకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. సర్వేకు సంబంధించి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నవీన్, వీఆర్‌ఓ సోమశేఖర్, సర్వేయర్లు పాల్గొన్నారు.

నేడు ధార్మిక సమ్మేళనం

ఓబులవారిపల్లె : యల్లాయపల్లె గ్రామంలోని హరిహర విద్యాలయ ప్రాంగణంలో హిందూ ధర్మిక సమ్మేళనం, విశ్వరూప కళల ప్రదర్శనను నేడు శనివారం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సమరసత సేవా ఫౌండేషన్ వారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద ప్రాచీన కళలను గుర్తించి గౌరవించడానికి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కళ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా తిరుపతి ఇస్కాన్ నుంచి స్వామి లీలా పారాయణదాసు, చిన్మయారణ్యం శ్రేయానంద మాతాజీ, సనాతన ధర్మసారథి బిరుదంకితులు పుసుపులేటి శంకర్‌లు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి వివిధ కళ ప్రదర్శనల అనంతరం శోభాయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశామని తెలియజేశారు.

భూ పంపిణీ చేయండి

ఓబులవారిపల్లె : భూములు లేని పేదలకు ఎనిమిదవ విడత భూ పంపిణీలో భూములు ఇవ్వాలని బీకేఎంయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోళ్ల మణి శుక్రవారం తహసీల్దార్ పుల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదలకు అఖిలపక్షం ఏర్పటు చేసి ఏడవ విడత భూములు పంపిణీ చేశారన్నారు. అదే తరహాలో ఎనిమిదవ విడతలో భూములు లేని పేదలను గుర్తించి వారికి భూములు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు మోది సుబ్బారాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి సి.నరసింహులు, శంకరయ్య, గంగయ్య, నరసింహులు పాల్గొన్నారు.

రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం అమ్మవారిని పూలు, ఆభరణాలు, పట్టువస్త్రాలు, నిమ్మకాయల హారాలతో అలంకరించారు. మహిళలు నిమ్మకాయలపై వత్తులు పెట్టి అమ్మవారికి హారతులు పట్టారు. పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పి.విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, రాచరాయ యోగీ స్వామి నిర్వహించారు.

సాధికారత, సంక్షేమాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- వేడుకలా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు
- ప్రజలకు ప్రభుత్వ మేలును వివరిస్తూ ముందుకు



రాజంపేట: సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి



రైల్వేకోడూరు : కిట్‌ను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందలూరు (రాజంపేట) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి కోరారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని సచివాలయం – 2లో ఆంధ్రరాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు కరపత్రాలను ఆయన అందజేసి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుంటూ ముందుకు సాగారు. లబ్ధిదారులు స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, సర్పంచ్ సూర్యనారాయణ, కరీముల్లా ఖాన్, ఆర్ముగం విశ్వనాథ్, గుణ యాదవ్, ఎముక దుర్గయ్య, రాణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల పరిధిలోని దిగువగొట్టివీడు సచివాలయంలో ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును సర్పంచ్ పి.రాజమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్పలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్వేత, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.రమణ, మల్లిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, రమణ, వెంకటేష్, రామకృష్ణ, సుల్తాన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : సాధికారత, సంక్షేమాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందని జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డిలు అన్నారు. సిద్దవటం మండలం పెద్దపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం సాయంత్రం స్థానిక సర్పంచ్ తుర్రా చిన్నక్క అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వారు సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బయ్య, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు నాగం నరసింహారెడ్డి, పిడుగు సుబ్బారెడ్డి, ఏకుల రామిరెడ్డి, ఎం.శ్రీనివాసులనాయుడు, కాడే వెంకటసుబ్బయ్య, మల్లారెడ్డి, గ్రామ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గాలివీడు : తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని మండల వైస్ ఎంపీపీ – 2 శ్రీనివాసులు, తలముడిపి సర్పంచ్ జ్యోతమ్మ, కొర్లకుంట పార్టీ ఇన్‌చార్జ్ భానుమూర్తిరెడ్డిలు అన్నారు. శుక్రవారం కొర్లకుంట గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పథకాలు లబ్ధిపొందిన సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ వెంకటరెడ్డి, సచివాలయం కన్వీనర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన సంక్షేమ పథకాల హామీలే కాకుండా, చెప్పని పథకాలను కూడా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నరవకాటిపల్లి గ్రామ సచివాలయంలో నిర్వహించిన రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమానికి ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంక్షేమ ఫలకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టక్కోలు శివారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ శివనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది,వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : రాష్ట్ర ప్రజలకు రానున్న రోజుల్లో కూడా మరింత మేలు జరగాలంటే రాష్ట్రానికి మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని ఉప సర్పంచ్ తోట శివసాయి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సచివాలయం–4లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుధాకర్‌రాజు, శివయ్య, ఎం.నాగేంద్ర, సీహెచ్ రమేష్, గునిశెట్టి రమేష్, సుదర్శన్‌రాజు, సుబ్రమణ్యం, రౌఫ్, కరీముల్లా, బండారు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



చిన్నమండెం: దిగువగొట్టివీడు గ్రామపరిధిలో..



ఒంటిమిట్ట: సంక్షేమ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం



గాలివీడు: జెండావిష్కరణలో నాయకులు

భక్తిశ్రద్ధలతో కార్తీక ఏకాదశి

రామాపురం : కార్తీక మాసంలో మొదటిగా వచ్చే ఏకాదశి పవిత్రమైనదిగా భావించి మండలంలోని పలు పుణ్యక్షేత్రాలలో ఏకాదశిని పండుగలా జరుపుకున్నారు. ముఖ్యంగా మండలంలోని బండపల్లె టోల్ ప్లాజా సమీపంలోని కంభరాయునిగుట్టపై వెలసిన శ్రీ దేవి భూదేవి సమేత మహావిష్ణు దేవాలయంలో, ద్వాదశి జ్యోతిర్లింగాలయాల్లో ఏకాదశిని కార్తీక మాస దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. అలానే మండలంలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులోని భవానీ శంకరాలయం, కల్పనాయినిచెరువులోని కల్పనాదేశ్వరుని ఆలయం, రామాపురంలోని హరిహరాలయం, హస్తినాపురంలో మూలస్థానేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తారు.

బాలసదన్ విద్యార్థులకు చేయూత



బాలసదన్‌లో కార్పొరేట్ పాఠశాల విద్యార్థులు

రాజంపేట రూరల్ : బాలసదన్‌లో ఉన్న అనాథ విద్యార్థులకు ఓ కార్పొరేట్ పాఠశాల విద్యార్థులు చేయూతనిచ్చారు. పట్టణంలోని సుదర్శన్ థియేటర్ వద్ద నున్న బాలసదన్‌కు శుక్రవారం వచ్చిన నారాయణ విద్యార్థులు అక్కడి అనాథ విద్యార్థులకు దుస్తులు, పండ్లతో పాటు నిత్యం ఉపయోగపడే సామగ్రి కిట్‌ను అందజేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ గీత మాట్లాడుతూ చిన్న వయసు నుంచి చేయూతనిచ్చే విధంగా ప్రోత్సహిస్తే విద్యార్థులు ఎంతో ఉన్నత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలసదన్ సూపరింటెండెంట్ వై.సుజమణి, కో ఆర్డినేటర్‌లు హెచ్.రమేష్, శారద, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు ప్రాధాన్యతను తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

రాజంపేట : ఓటు హక్కు అందరి హక్కు అని రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాజంపేట ఏఐటీఎస్‌లో ఎస్‌వీఈఈపీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది చాలా కీలకమైందన్నారు. ఓటు అనే ఆయుధంతో పాలకులను ఎన్నుకోవడం జరుగుతోందన్నారు. ఓటును ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. జనవరి ఒకటి నాటికి 18 2024 సంవత్సరాలు నిండిన, నిండుతున్నట్లయితే ఓటరుగా తప్పనిసరిగా నమోదు కావాలన్నారు. ఓటర్లు జాబితాలోని వారు తమ పేర్లను తిరిగి నమోదు చేసుకోవచ్చునన్నారు. ఓటు నమోదు కోసం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటుపై నేటి సమాజంలోని యువతీయువకులు అవగాహన కల్పించుకోవాలన్నారు. ఓటు ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ సుబ్రమణ్యంరెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ కో–ఆర్డినేటర్ డా.ఎల్.ఓబులపతి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వివరించేందుకే 'వికాసిత్' యాత్ర

రాయచోటి టౌన్ : కేంద్ర ప్రభుత్వం 17 రకాల పథకాలను ప్రవేశ పెట్టిందని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ కోరారు. శుక్రవారం ఆయన అన్నమయ్య జిల్లా బీజేపీ కార్యకర్తలు, నాయకులతో కలసి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమం కోసం 17 రకాల పథకాలను ప్రవేశ పెట్టారని తెలిపారు. ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి వికాసిత్ సంకల్ప భారత యాత్ర చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతి రాజు, రాయచోటి కన్వీనర్ ముక్కుపోగు రమణ, కో–కన్వీనర్ నిర్మల్‌కుమార్, రేపన శివప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

నందలూరు (రాజంపేట) : డిసెంబర్ 3వ తేదీ నుంచి 26వ తేదీ వరకు గ్రామగ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార రథం కార్యక్రమం ఉంటుందని బీజేపీ రాజంపేట అసెంబ్లీ కో–కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం నందలూరులో బీజేపీ మండల కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు విఠల్ స్వామి, మండల అధ్యక్షుడు శివారెడ్డి, యువ మోర్చా నాయకుడు శ్రీను, రామయ్య, బీజేపీ సీనియర్ నాయకులు ఆదినారాయణలు పాల్గొన్నారు.

రామాపురం : ఈనెల 26 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో భారత్ సంకల్పయాత్రను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హైదర్‌వలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంకల్ప యాత్ర గ్రామాల వారీగా 26న గువ్వలచెరువు నుంచి ప్రారంభమవుతుందన్నారు.

సమయానికి బస్సులు నడపాలని విద్యార్థుల ధర్నా



ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు

రాజంపేట టౌన్ : విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడపాలని ఏబీవీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ అంజద్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా అంజద్ మాట్లాడుతూ దాసరిపల్లె బస్సు పుల్లారెడ్డిపల్లె వరకు మాత్రమే వెళ్లడం వల్ల దాసరిపల్లెకు చెందిన విద్యార్థులు బడులకు వచ్చి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే అనంతసముద్రం బస్సు సాయంత్రం 6:30 గంటలకు రాజంపేట నుంచి బయలుదేరుతుండటంతో విద్యార్థులు పాతబస్టాండులో 5 గంటల నుంచి వేచి ఉండాల్సి వస్తుందన్నారు. ఆర్టీసీ అధికారులు విద్యా సంస్థలకు అనుగుణంగా బస్సు సర్వీసులను నడపకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కాగా విద్యార్థులు చేపట్టిన ధర్నా కారణంగా ఉదయం పైమార్గంలో పలు ఆర్టీసీ బస్సులు కొద్దిసేపు నిలిచిపోయాయి.

వేధింపులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్‌లపై వేధింపులకు పాల్పడుతున్న విద్యుత్‌శాఖ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సాంబశివ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జాబ్‌చార్ట్ ప్రకారం ఎనర్జీ అసిస్టెంట్‌లు ఎల్టీలైన్‌లలో లైన్‌మెన్‌లకు సహాయకులుగా ఉండడంతో పాటు ఇతర పనులలో లైన్‌మెన్‌లతో పరిష్కరింపచేయించి విద్యుత్ సమస్యలను తీర్చాల్సి ఉంటుందన్నారు. కాగా విద్యుత్ శాఖ అధికారులు జాబ్‌చార్ట్‌ను పక్కనపెట్టి ఎక్కడ విద్యుత్‌శాఖ ఉద్యోగులు పనిచేయకుండా మొత్తం పని అంతా ఎనర్జీ అసిస్టెంట్లతోనే చేయిస్తున్నారంటూ ఆరోపించారు. విద్యుత్ అధికారుల వేధింపుల కారణంగా 120 మందికి పైగా ఎనర్జీ అసిస్టెంట్‌లు చనిపోయారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం చక్రాయపేటలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ రామచంద్రారెడ్డి మరణించడమే ఇందుకు మంచి ఉదాహరణ అన్నారు. చనిపోయిన అసిస్టెంట్‌ల కుటుంబాలకు రూ.50 లక్షలు ఆర్థికసహాయం అందించాలంటూ డిమాండ్ చేశారు.

1న అయ్యప్పస్వామి గ్రామోత్సవం

రాజంపేట రూరల్ : శ్రీఅయ్యప్పస్వామి దేవస్థానం 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబరు 1న గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లో దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలియచేశారు. స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో శుక్రవారం గ్రామోత్సవ ఆహ్వాన కరపత్రాలను కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త పాల ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగే ఉత్సవంలో ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భిక్ష, సాయంత్రం 5 గంటలకు ఆలయం నుంచి అయ్యప్ప గ్రామోత్సవం ప్రారంభమవుతుందన్నారు. రాత్రి 10గంటలకు అంబటి రామస్వామి మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశామన్నారు. కర పత్రాలు ఆవిష్కరించిన వారిలో రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కొండా సత్యనారాయణ, కొత్తపల్లి నాగరాజ, కె.దాము ఆచారి, కుప్పా రమేష్, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం : అసాంఘిక శక్తుల సమాచారాన్ని ప్రజలు పోలీసులకు తెలపాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం విజబుల్ పోలీసింగ్‌ను నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతే గాకుండా వాహనాలను తనిఖీ చేసి వాహనాలకు సంబంధించిన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

రక్తదానం

రాయచోటి టౌన్ : వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్న బాలింత జాకీరాకు బ్లడ్ మోటివేటర్ డాక్టర్ సయ్యద్ మొయినుద్దీన్ తన సహచరులు మొత్తం 11 మందితో కలిసి రక్తదానం చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణానికి చెందిన జాకీరా ప్రసవ సమయంలో పాప (గర్భంలోనే) చనిపోవడంతోపాటు తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. అక్కడి డాక్టర్లు ఆమెకు శస్త్రచికిత్స చేయడానికి రక్తం చాలా అవసరం అవుతుందని సూచించడంతో ఆయన తన స్నేహితులను తీసుకెళ్లి ఆమెకు రక్తదానం చేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుక



కేకును కట్ చేస్తున్న కొండూరు ప్రభావతమ్మ

పెనగలూరు : మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ పుట్టినరోజు వేడుకలు కొండూరు గ్రామంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. 85వ జన్మదిన వేడుకలలో భాగంగా మాజీ ఎమ్మెల్యే కేక్‌ను కట్ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు ఈ వేడుకలలో పాల్గొని ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

పందెంరాయుళ్ల అరెస్టు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని అమ్మవారిపల్లి చెరువు నందు కోడిపందెలు ఆడుతున్న జూదరులను శుక్రవారం ఎస్ఐ మధుసూదన్ రావు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. దాడిలో ఏడుగురితో పాటు ఏడు ద్విచక్రవాహనాలను, రూ. 11400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయిలోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : ఎస్జీఎఫ్ఐ అండర్ – 17, అండర్ – 14 పోటీలలో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని శుక్రవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అండర్ – 17 కబడ్డీ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



గణేష్‌తో ఎంఈఓ, ఉపాధ్యాయలు

సిద్దవటం : జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు సిద్దవటం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి పాలెం గణేష్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీరాములు, పీడీ రెడ్డెమ్మలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో గణేష్ ప్రతిభ కనబరచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడన్నారు. విద్యార్థి గణేష్‌ను ఎంఈఓ శంకరయ్య, ఉపాధ్యాయులు రామలింగరాజు, వెంకటసుబ్బయ్య, పి.డిలు అభినందించారు.

చదువులకు కేంద్రంగా రాయచోటి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ముఖాముఖి



రాయచోటి: ఎమ్మెల్యే గడికోటకు గౌరవ వందనం చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు

రాయచోటి : జిల్లా కేంద్రంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అనుగుణంగా విద్యాలయాలను ఏర్పాటు చేసి విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల అభివృద్ధిపై విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యేకు కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనం చేశారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. రాయచోటి ప్రాంత ప్రజలకు చదువులే ఆధారమన్నారు. నియోకవర్గంలో ఆరు మండలాలకుగాను ఐదు మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయించామన్నారు. నాడు – నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. మూడవ తరగతి నుంచి డిగ్రీ వరకు బాలికలకు ఒకేచోట విద్యా సౌకర్యాలు అందేలా మహిళా ప్రాంగణంగా గర్ల్స్ హైస్కూల్‌ను అభివృద్ధి చేశామన్నారు. నూతన ఆలోచనా విధానాలతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. తద్వారా మానవతా విలువలు పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులతో ముఖాముఖిగా శ్రీకాంత్ రెడ్డి చర్చించి విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు జగనన్న ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలకు ఈ సందర్భంగా విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాశాల గదులను ఎమ్మెల్యే పరిశీలించారు. కళాశాల ప్రాంగణానికి సరిహద్దులు కేటాయించాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హర్షలత పంకజ్, వైస్ ప్రిన్సిపాల్ మునియా నాయక్, అధ్యాపకులు ప్రసాద్, ఎస్ఎండీ బాషా, గుర్రప్ప, జబివుల్లా, ఇస్మాయిల్, మధుసూదన్ రెడ్డి, శివమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులపై సమీక్ష



అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్ల రిపేర్లపై పీడీ ధనలక్ష్మీ, సీడీపీఓ సౌభాగ్యమ్మలు అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష జరిపారు. 96 అంగన్‌వాడీ సెంటర్లు రిపేర్లకు నిధులు మంజూరయ్యాయన్నారు. నాణ్యతగా పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సరళాదేవి, అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : నాడు – నేడు ఫేజ్ – 2బీ కింద ఎన్నికైన అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేసే అంగన్‌వాడీ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో సీడీపీఓ వై.సుజామణి, ప్రాజెక్టు కో – ఆర్డినేటర్ హనుమంతు రమేష్‌లు పాల్గొని శిక్షణ అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో నూతనంగా ఏర్పాటు చేసే టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతోపాటు నూతన మరమ్మతులు చేసే సాంకేతిక పరిజ్ఞానముపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజు, రీసోర్స్ పర్సన్ రాజు పాల్గొన్నారు.

అయ్యప్ప గ్రామోత్సవానికి విరాళం

నందలూరు (రాజంపేట) : డిసెంబర్ 4న నాగిరెడ్డిపల్లెలో నిర్వహించే అయ్యప్ప స్వామి గ్రామోత్సవానికి రాజంపేట నియోజకవర్గ జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు శుక్రవారం ఆయన నివాసంలో రూ. 50 వేలు గ్రామోత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శివరామరాజు, సమ్మెట శివప్రసాద్, అయ్యప్పస్వామి కమిటీ సభ్యులు బాలాంజనేయులు, జనార్దన్ రెడ్డి, శివశంకర్, సుధాకర్, మురళీ, సుబ్బరాయుడు, కార్తిక్, సోమశేఖర్‌లు పాల్గొన్నారు.